నమస్తే తెలంగాణ
# వికారాబాద్
I | హైదరాబాద్, శనివారం 1 జూన్ 2024 | VIKARABAD



మొయినాబాద్ : ఫర్టిలైజర్ దుకాణంలో స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ శశాంక

## విత్తనాల కొరత లేకుండా చూడాలి

**రంగారెడ్డి కలెక్టర్ శశాంక.. ఫర్టిలైజర్ దుకాణాల్లో తనిఖీలు..**

మొయినాబాద్, మే 31: విత్తనాల కొరత లేకుండా.. రైతులకు అన్ని రకాల సీడ్స్‌ను అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని రంగారెడ్డి కలెక్టర్ శశాంక అన్నారు. శుక్రవారం మొయినాబాద్ మండల కేంద్రంలోని బాలాజీ ఫర్టిలైజర్ దుకాణాన్ని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గీతారెడ్డితో కలిసి ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్, విత్తనాలు, బిల్లుబుక్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తి విత్తనాలను ఎట్టి పరిస్థితుల్లో లూజుగా విక్రయించరాదన్నారు. విత్తనాలు, ఎరువులను ఎంఆర్‌పీ ధరలకు విక్రయించాలని, లేనిచో చర్యల తప్పవని హెచ్చరించారు. రైతులకు తప్పని సరిగా బిల్లులు ఇవ్వడంతోపాటు ఆ వివరాలను ఎప్పటికప్పుడు రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. అనంతరం ఏకరూప దుస్తులను కుట్టే బాధ్యతను మహిళా సంఘాలకు అప్పగించిన నేపథ్యంలో మొయినాబాద్ మండలం చిలుకూరులోని మహిళా శక్తి కుట్టు కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఇప్పటివరకు ఎన్ని జతల యూనిఫామ్‌లు కుట్టారు.. ఇంకా కుట్టాల్సిన వెన్ని.. క్లాత్ అందుబాటులో ఉన్నదా.. లేదా వంటి వివరాలపై ఆరా తీశారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు యూనిఫామ్‌లు సకాలంలో అందేలా చూడాలని కలెక్టర్ సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ గౌతమ్‌కుమార్, మండల వ్యవసాయ అధికారి రాగమ్మ, ఆర్‌ఐ చంద్రమోహన్, ఏఈవో సునీల్, డీలర్ బాల్‌రెడ్డి, ఏపీఎం రవీందర్, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్ తదితరులు ఉన్నారు.




వికారాబాద్‌లో ఫర్టిలైజర్ దుకాణంలో రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

## రైతులు ఆందోళనపడొద్దు

**వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి**

వికారాబాద్, మే 31 : సరిపడా విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, రైతులెవరూ ఆందోళన చెందవద్దని వికారాబాద్ కలెక్టర్ నారాయణ రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సురేశ్ ఏజెన్సీ ఫర్టిలైజర్ దుకాణంలో వ్యవసాయాధికారులతో కలిసి తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి అందుబాటులో ఉన్న విత్తనాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యల తప్పవని హెచ్చరించారు. జిల్లాలో 2.63 లక్షల హెక్టార్లలో పత్తి సాగు చేసే అవకాశముందని, అందుకోసం 5.42 లక్షల విత్తనాల ప్యాకెట్లు అవసరమవుతాయన్నారు. ఇప్పటికే 3.12 లక్షల ప్యాకెట్లు ఉన్నాయని, త్వరలోనే మరిన్ని అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు. రైతులు విత్తనాల విషయంలో ఎలాంటి సందేహాలున్నా వ్యవసాయాధికారులను సంప్రదించాలని కోరారు. అన్నదాతలకు ఎలాంటి సమస్యలు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. డీలర్లందరూ విత్తన చట్టానికి లోబడి, నిబంధనలను అనుసరిస్తూ ముందుకుసాగాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ నకిలీ విత్తనాల విక్రయించరాదన్నారు. ఎప్పటికప్పుడు స్టాక్ బోర్డు, స్టాక్ రిజిస్టర్‌లో వివరాలను నమోదు చేయాలన్నారు. సీడ్ డీలర్లు సైతం సీడ్ సర్టిఫికేషన్ ఉన్న విత్తనాలను మాత్రమే కొనాలని, ఎటువంటి అలసత్వం తగదన్నారు. రైతులను మోసం చేయాలని చూస్తే కఠినంగా వ్యవహరిస్తామని, అవసరమైతే పీడీ యాక్ట్ కేసులు కూడా నమోదు చేస్తామని హెచ్చరించారు. విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసిన రైతులకు విధిగా రసీదు ఇవ్వాలన్నారు. కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్, ఏవో జ్యోతి తదితరులు ఉన్నారు.



**20 లక్షల వరకు జరిమానా విధిస్తాం**



ప్రైవేటు స్కూళ్లల్లో పుస్తకాలు, స్టేషనరీ విక్రయించడం నేరం. నిబంధనలు అతిక్రమిస్తే స్కూల్ రిజిస్ట్రేషన్ రద్దు చేస్తాం. అవసరమైతే 20 లక్షల వరకు జరిమానా విధిస్తాం. నిబంధనలు పాటించాలి. విద్యాసంస్థలు ఎప్పుడూ లాభాపేక్ష లేకుండా కొనసాగాలి. జిల్లాలో ఏ స్కూల్లోనైనా పుస్తకాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

**-సుశీంధర్ రావు, డీఈవో, రంగారెడ్డి**

# కౌంటర్లు తెరిస్తే కఠిన చర్యలే!

## ప్రైవేటు స్కూళ్లకు విద్యాశాఖ అల్టిమేటం

- పుస్తకాలు, యూనిఫాం, స్టేషనరీ విక్రయానికి వీలులేదు
- నిబంధనలు అతిక్రమిస్తే కేసులు, స్కూల్ రిజిస్ట్రేషన్ రద్దు
- డిప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీసర్లు, స్కూల్ ఇన్‌స్పెక్టర్లతో తనిఖీ బృందాలు



సిటీబ్యూరో, మే 31 (నమస్తే తెలంగాణ) : విద్యను వ్యాపారంగా మలిచే ప్రైవేటు స్కూళ్లపై చర్యలు తీసుకునేందుకు జిల్లా విద్యాశాఖ సిద్ధమైంది. స్కూళ్లలో పుస్తకాలు, యూనిఫాంలు, బెల్టులు, స్టేషనరీ వ్యాపారం చేస్తే కఠిన చర్యలు తీసుకోనున్నారు. అధిక ధరలతో ప్రతి విద్యాసంవత్సరంలో సొమ్ము చేసుకుంటున్న స్కూళ్ల ఆగడాలకు బ్రేకులు వేయడానికి డిప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీసర్లు, డిప్యూటీ స్కూల్ ఇన్‌స్పెక్టర్ల ఆధ్వర్యంలో ప్రత్యేక తనిఖీ బృందాలు సిద్ధమయ్యాయి. ప్రత్యేక కౌంటర్లు తెరిచి వ్యాపారం చేసే స్కూళ్లను గుర్తించి.. కేసులు నమోదు చేయడం, స్కూల్ అనుమతి రద్దు చేయడం వంటి తీవ్ర చర్యలు కూడా తీసుకోనున్నారు. ఎటువంటి స్కూళ్లల్లోనైనా విద్యకు సంబంధించిన సామగ్రి విక్రయించడానికి వీలు లేదని డీఈవో రోహిణి స్పష్టం చేశారు.

### 8వేలకు పైగా పాఠశాలలు..

నగరంలో సుమారు 8వేలకు పైగా పాఠశాలలు ఉన్నాయి. ప్రతి ఏడాది తల్లిదండ్రులకు పిల్లలను చదివించడం కత్తిమీద సాములా మారింది. ఎల్‌కేజీ అడ్మిషన్ డొనేషన్‌కు సైతం లక్షలు చెల్లించాల్సిన దుస్థితి నెలకొన్నది. ఇక ఫీజులు లక్షల్లోనే... ఇంతటితో ఆగకుండా కొన్ని స్కూళ్ల యాజమాన్యాలు పిల్లలు ధరించే యూనిఫాంలు, రాసుకునే పెన్నులు, చదివే పుస్తకాలు, ఇతర స్టేషనరీ అంతా తామే అమ్ముతామని తమ దగ్గర మాత్రమే కొనుగోలు చేయాలని హుకుం జారీ చేస్తున్నాయి. దీంతో తల్లిదండ్రులు వేల రూపాయలు గుమ్మరించి.. యాజమాన్యాలు కొనుగోలు చేయమన్న ప్రతీది కొనాల్సిన పరిస్థితి వస్తున్నది. జూన్ వచ్చిందంటే పిల్లల చదువు, పుస్తకాల ఫీజులు గుర్తొచ్చి బెంబేలెత్తుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రైవేటు స్కూళ్ల ఆగడాలకు కొంతనైనా అడ్డుకట్ట వేసేందుకు అధికారులు దృష్టి సారించడంపై పేరెంట్స్ సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



జిల్లెలగూడ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో దశాబ్ది ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

## దశాబ్దిని ఘనంగా నిర్వహిద్దాం

**ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి**

బడంగ్‌పేట, మే31: మహేశ్వరం నియోజకవర్గ వ్యాప్తంగా తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి బీఆర్‌ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని జిల్లెలగూడ ఆర్‌సీఐ రోడ్డులోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహేశ్వరం నియోజకవర్గవ్యాప్తంగా దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని, 1 నుంచి 3 వరకు కార్యక్రమాలు ఉంటాయని ఆమె వెల్లడించారు. శనివారం సాయంత్రం 6 గంటలకు అమరవీరులకు నివాళులర్పిస్తూ.. కొవ్వొత్తుల ర్యాలీ, 2న సాయంత్రం 6 గంటలకు జిల్లెలగూడ చందన చెరువు కట్టపై ఉన్న అమర వీరుల స్తూపం వద్ద అమర వీరుల కుటుంబాలు, తెలంగాణ ఉద్యమకారులకు సన్మానం ఉంటుందన్నారు.3న అన్ని మండలాలు, గ్రామాలు, మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్, డివిజన్ల పరిధిలో జాతీయజెండాలతో పాటు బీఆర్‌ఎస్ జెండాలను ఆవిష్కరించాలన్నారు.



# లక్ష్యం చేరలే!

**33 కేంద్రాలకుగాను 19 కేంద్రాల్లోనే ధాన్యం కొనుగోళ్లు**

**అంచనా..40వేల మెట్రిక్ టన్నులు.. కొన్నది 10,341 మెట్రిక్ టన్నులే..**

**కొనుగోళ్లు తగ్గడానికి కారణం ధాన్యం ప్రైవేటుకు తరలివెళ్లడమే..**

**రూ.22కోట్ల బకాయిలకు.. చెల్లించింది రూ.12.25 కోట్లు మాత్రమే**

రంగారెడ్డి, మే 31(నమస్తే తెలంగాణ) : జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు ముగింపు దశకు చేరగా.. ఈసారి జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు ఆశించిన మేరలో జరుగలేదు. 40 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం కాగా.. ఇప్పటివరకు 10,341.600 మెట్రిక్ టన్నులే కొనుగోలు చేశారు. కొనుగోళ్ల కోసం జిల్లా వ్యాప్తంగా 33 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించగా.. 19 కేంద్రాల్లోనే కొనుగోళ్లు జరిగాయి. మిగిలిన 14 కేంద్రాలకు పిడికెడు ధాన్యం కూడా రాలేదు. దాదాపు కొనుగోళ్ల ప్రక్రియ పూర్తయినట్లేనని, రెండు, మూడు కేంద్రాల్లో కొద్దిపాటిగా ధాన్యం మిగిలిపోయినట్లు అధికారులు చెబుతున్నారు. దీంతో ఈసారి అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవడం సందేహాస్పదమే కానున్నది. సన్నవడ్లకు కొనుగోలు కేంద్రాల్లో చెల్లిస్తున్న మద్దతు ధర కంటే బయటి మార్కెట్లో ఎక్కువగా ఉండడంతో చాలా మంది రైతులు ప్రైవేటుగా వ్యాపారులకు అమ్ముకున్నారు. ఈ కారణంగా షాద్‌నగర్, ఆమనగల్లు తదితర ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినప్పటికీ రైతుల నుంచి ధాన్యం రాలేదు. కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యంలో అత్యధికంగా దొడ్డు రకమే ఉన్నది.

### రైతుల ఖాతాల్లో రూ.12.25కోట్లు జమ..

కొనుగోలు కేంద్రాల్లో రైతులు విక్రయించిన ధాన్యానికి రూ.22కోట్లు చెల్లించాల్సి ఉండగా.. ఇప్పటివరకు రూ.12.25 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేశారు. ఇంకా రూ.9.75కోట్లు చెల్లించాల్సి ఉన్నది. కేంద్రాల్లో ఓపీఎంఎస్ ఎంట్రీస్ పూర్తి చేసి బిల్లులను సివిల్ సప్లయ్ అధికారులకు పంపడంలో ఆలస్యం జరుగడం వల్ల చెల్లింపుల్లో ఆలస్యం జరుగుతున్నట్లు తెలుస్తున్నది. ఆన్‌లైన్‌లో వివరాలు సరిగా లేకపోవడం వంటి వివిధ కారణాలతో డాక్యుమెంటేషన్ ప్రక్రియను పూర్తి చేసేందుకు సమయం పడుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఓపీఎంఎస్ ఎంట్రీస్ పూర్తయి, బిల్లులు సమర్పించిన ఒక్కరోజులోనే రైతుల ఖాతాల్లో ధాన్యం డబ్బులను జమ చేస్తున్నామని అధికారులకు చెబుతున్నారు.

**డబ్బుల కొరత లేదు : విజయలక్ష్మి, డీఎం, సివిల్ సప్లయ్, రంగారెడ్డి జిల్లా**

ధాన్యం డబ్బుల చెల్లింపునకు నిధుల కొరత లేదు. ప్రతి రోజూ రెండు పర్యాయాలు సివిల్ సప్లయ్ శాఖకు ప్రభుత్వం నిధులను విడుదల చేస్తూ వస్తున్నది. కొనుగోలు కేంద్రాల నుంచి బిల్లులు వచ్చిన ఒక్క రోజులోనే రైతుల ఖాతాల్లో డబ్బులను జమ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇంకా కొన్ని కేంద్రాలకు కొద్దిపాటిగా ధాన్యం వస్తున్నది. ఇది పూర్తయితే జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ ముగిసినట్లే.

**జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల వివరాలు..**

| | |
|---|---|
| మొత్తం కొనుగోలు కేంద్రాలు | 33 |
| కొనుగోళ్లు జరిగిన కేంద్రాలు | 19 |
| విక్రయించిన రైతులు | 1,113 మంది |
| సేకరించిన ధాన్యం | 10,341.600 మెట్రిక్ టన్నులు |
| వాటి విలువ | రూ.22కోట్లు |
| రైతుల ఖాతాల్లో జమ | రూ.12.25కోట్లు |
| బకాయిలు | రూ.9.75కోట్లు |

# ఈ-వేలానికి ఇంకెన్నాళ్లు?

- వేలంపై ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురుచూపులు..
- లీజు విధానంలోనే కొనసాగుతున్న గనుల తవ్వకాలు
- దీంతో ప్రభుత్వ ఖజానాకు భారీ నష్టం..
- అనుమతిలేని గనుల తవ్వకాలతో ప్రభుత్వానికి రూ.కోట్లలో ఆదాయం నష్టం





వికారాబాద్, మే 31(నమస్తే తెలంగాణ): గనులను ఈ-వేలానికి ఇంకా మోక్షం లభించడంలేదు. ప్రస్తుతం కొనసాగుతున్న లీజు విధానానికి స్వస్తి పలికి.. వేలం వేసే విధానాన్ని తీసుకువచ్చేందుకు జిల్లా గనుల శాఖ అధికారులు కసరత్తు పూర్తి చేసినా.. ప్రభుత్వం ఇంకా నిర్ణయం తీసుకోకపోవడంతో పెండింగ్‌లో పడింది. ఇప్పటికే రంగారెడ్డి, యాదాద్రి జిల్లాల్లో పైలట్ ప్రాజెక్టుగా గనుల ఈ-వేలం విధానాన్ని అమలు చేస్తున్నారు. దీన్ని వికారాబాద్ జిల్లాలోనూ అమలు చేసేందుకు అధికారులు గనులున్న ప్రాంతాలకు సంబంధించిన డీజీపీఎస్ మ్యాపులను సిద్ధం చేయడంతోపాటు రెవెన్యూ శాఖ నుంచి ఎన్‌వోసీలను కూడా సేకరించి ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నారు.

### లీజు విధానంతో ప్రభుత్వానికి తీవ్ర నష్టం..

లీజుకిచ్చే పద్ధతితో ప్రభుత్వానికి రూ.కోట్లలో నష్టం జరుగుతుంది. దీన్ని నివారించేందుకు ఈ-వేలం విధానంతో గనుల తవ్వకాలకు అనుమతులు మంజూరు చేసేలా ప్రభుత్వానికి జిల్లా యంత్రాంగం ఆరు నెలల క్రితమే ప్రతిపాదనలను అందజేసింది. ఇప్పటికీ ప్రభుత్వం నుంచి అనుమతులు రాకపోవడంతో గనుల తవ్వకాలు లీజు విధానంలోనే కొనసాగుతున్నది. మైనింగ్ వ్యాపారులు.. ఒకచోట లీజుకు తీసుకొని.. పలు ప్రాంతాల్లో తవ్వకాలు చేపడుతున్నారనే ఆరోపణలున్నాయి. అంతేకాకుండా లీజు గడువు పూర్తయినా తవ్వకాలు జరుపుతూనే ఉండడంతో ప్రభుత్వం పెద్ద ఎత్తున ఆదాయం కోల్పోతున్నది. రెండేండ్లుగా జిల్లావ్యాప్తంగా వెయ్యికిపైగా దరఖాస్తులురాగా.. అవన్నీ పెండింగ్‌లోనే ఉన్నాయి. ఈ-వేలం విధానంతో నిర్ణీత సమయానికి గనుల తవ్వకాలకు అనుమతులు మంజూరు చేస్తారు కాబట్టి వాటిని పెండింగ్‌లోనే ఉంచి.. లీజు విధానాన్ని అమలు చేస్తున్నారు.

### అక్రమాలకు అడ్డుకట్ట వేయాలి..

జిల్లాలో అనుమతులు పొందకుండానే మైనింగ్ నిర్వహిస్తున్నట్లు తెలుస్తున్నది. తాండూరు నియోజకవర్గంలో నాపరాయి, సుద్ధ గనులు, ఎర్రమట్టిని తవ్వి తరలిస్తున్నారు. అయినా రెవెన్యూ అధికారులు, మైన్స్ అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఫిర్యాదులు అందితే తుతూమంత్రంగా గనులకు వెళ్లి అక్కడున్న చిన్నచిన్న యంత్రాలను సీజ్ చేసి చేతులు దులుపుకుంటున్నారని ప్రజలు వాపోతున్నారు. సర్వే నంబరు పేరు ఒకటి ఉంటే, మరో చోట కనెక్షన్ తీసుకొని తవ్వకాలు జరుపుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. రెవెన్యూ, విద్యుత్, మైన్స్, పోలీసు అధికారులు సంయుక్తంగా దాడులు చేస్తేగానీ అక్రమ తవ్వకాలకు అడ్డుకట్ట పడేలా లేదని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

### గతేడాది గనుల లీజుతో భారీ ఆదాయం...

2023-24 ఆర్థిక సంవత్సరం గనుల లీజుల ద్వారా రూ.115.04 కోట్ల ఆదాయం ప్రభుత్వ ఖజానకు చేరింది. గతేడాది రూ.113.46 కోట్ల రెవెన్యూ వస్తుందని అధికారులు అంచనా వేయగా.. ఏకంగా అంతకుమించి ఆదాయం లభించింది. ఇందులో పెద్ద తరహా గనుల లీజుతో రూ.27.08 కోట్లు, చిన్నతరహా గనుల లీజుతో రూ.87.95 కోట్ల ఆదాయం వచ్చింది. ఏప్రిల్‌లో రూ.10.68 కోట్లురాగా, మేలో రూ.10.96 కోట్లు, జూన్‌లో రూ.12.76 కోట్లు, జూలైలో రూ.7.70 కోట్లు, ఆగస్టులో 9.30 కోట్లు, సెప్టెంబర్‌లో రూ.7.51 కోట్లు, అక్టోబర్‌లో రూ.8.49 కోట్లు, నవంబర్‌లో రూ.7.30 కోట్లు, డిసెంబర్‌లో రూ.8.73 కోట్లు, జనవరిలో రూ.8.93 కోట్లు, ఫిబ్రవరిలో రూ.15.47 కోట్లు, మార్చిలో రూ.7.18 కోట్ల ఆదాయం మైనింగ్ శాఖకు వచ్చింది.

### జిల్లాలోని గనులివే..

జిల్లాలో ఎర్రమట్టి, సుద్ధ గనులు, నాపరాయి, పలుగురాయి, సెల్డ్‌స్పార్, కంకర, గ్రానైట్ గనుల తవ్వకాలు జరుగుతున్నాయి. పెద్దేముల్, మర్పల్లి, వికారాబాద్, పరిగి మండలాల్లో 610 హెక్టార్ల విస్తీర్ణంలో 40 ఎర్రమట్టి గనులున్నాయి. తాండూరు మండలంలో 100 హెక్టార్ల విస్తీర్ణంలో 160 నాపరాయి గనులున్నాయి. పెద్దేముల్, మర్పల్లి, ధారూర్ మండలాల్లో 41 హెక్టార్ల విస్తీర్ణంలో 65 సుద్ధ గనులు, వికారాబాద్, దోమ మండలాల్లో 86 హెక్టార్లలో 34 కంకర గనులున్నాయి. తాండూరు మండలంలో 12 హెక్టార్లలో 6 గ్రానైట్ గనులుండడంతో పాటు దోమ మండలంలో 76 హెక్టార్లలో 6 పలుగు రాళ్ల గనులున్నాయి.



## జనంలేక వెల వెల..

భానుడి ప్రతాపానికి జనం విలవిలలాడుతున్నారు. ఉదయం 9 గంటల నుంచే ఎండ తీవ్రమవుతున్నది. దీనికి వడగాలులు తోడవ్వడంతో జనం ఇంటి నుంచి బయటికి రావాలంటేనే జంకుతున్నారు. శుక్రవారం చేవెళ్ల నుంచి హైదరాబాద్ వెళ్లే రహదారి ఇలా జనం లేక వెలవెలబోయింది.